# కిష్టయ్య

పదేళ్ళయాక సుబ్బరామయ్య చెప్పిన కథ, కమీమిషూను ఇదంతా –

ఉన్నట్టుండి గభీమని రెక్కతోసుకుని లోపలికి వచ్చేశాడు పద్నాలుగేళ్ళ కుర్రాడు–

ముణుకులు దిగని ఎర్ర చారల లాగూ, నల్లనేరేడు పండు రంగు పొడుగు చేతుల బనీనూ, నల్లగా తుమ్మెద నలుపులో అంటకత్తెర వేసిన తలా వీడూ ఊసలా లోపలికి వచ్చేశాడు.

తలవంచుకు కాగితం చూసుకుంటున్న వాడల్లా సుబ్బరామయ్య దిమ్మరపోయి తలెత్తాడు. ఎత్తేసర్కి వీడు – వేలెడంత మనిషి! నూనె కారుతూ నిలుచున్నాడు.

చెప్పి చెయ్యకుండా బెత్తు కుర్చీలో బైఠాయించి రివటలా అటూ ఇటూ ఊగిపోతూ అడిగాడు వాడు.

"మీరేనా 'సాహితి' సంపాదకులు?"

"అవును, ఏం?"

"నా కథ ఏం చేశారు?..."

"నీ కథేమిటి?"

"అదే నా కథ పేరు."

"ఎప్పుడు పంపావు?

"పంపి పది నెల్లయింది. ఏ నెలకానెల వేస్తారని చూస్తూండడం. వెయ్యక

పొయ్యేసరికి ఉత్సాహం నిభాయించుకొంటూండడం. పోనీ తిప్పి పంపుతారని చూస్తే అదీ లేదు. ఇలా పస్తాయిస్తే నాలాంటి కుర్రకారు ఉత్సాహం ఎంత చచ్చిపోతుందో మీకు తెలీదు. అది పడితే మరి నాలుక్కథలు రాయాలనుకున్నాను. మొదటికే ఎగనామం చేసేశారు."

ఎంతో సత్తావున్న రచయితలాగ ఖంగుమంటున్న వాడిని చూసి సుబ్బరామయ్య విస్తుపోయాడు. కాగితం, గ్రూ పక్కని పెట్టేసి ఎదురుగ్గా కాళ్ళు ఎడదన్ని తీరిగ్గా కూచున్నాడు వాడితో బాతాఖానీకి.

"నీ పేరేమిట్రా అబ్బి!"

"కిష్టయ్య."

"ఎన్ని పేజీల్రాసేవేమిటి?"

"ఎనిమిది"

"అబ్బో! ఏ నెల్లో పంపేవో గుర్తుందా?"

"నెలేమిటి? రోజు కూడాను. జనవరి 28. ఆ రోజు నా పుట్టిన రోజు. చచ్చీ చెడీ రాసి పంపాను. మీరిలా చేసారు."

కన్నెత్తడమే అపురూపంగా ఉండే సుబ్బరామయ్యకు ఆనాడు కుర్రాడితో కులాసాగా గడపాలని కోరిక పుట్టడం ఆశ్చర్యమే. ఎప్పుడూ రుసరుసలాడే ముక్కు ఎరుపెక్కలేదు. పైగా పెదిమెలు విప్పి, కనురెప్పలు టపటలాడించి, ముందు ఎత్తుపళ్ళు పైకి జాపి ఉప్పెనలా నవ్వాడు.

"అల్లా ఎదురుగ్గా ఉన్న బీరువాలో నీ కథ ఎక్కడుందో వెదుక్కోగలవా?" అన్నాడు వాడితో.

"ఓ" అన్నాడు వాడు లాగు మీదికి ఎగదోసి, ముక్కు చీమిడి జబ్బతో తుడుచుకొని. బొటన వేళ్ళ మీద నిలబడి పైనుంచి కిందివరకూ వెదికేశాడు కిష్టయ్య.

ఇటు కదిల్తే ఇటూ, అటు కదిల్తే అటూ కంటిపాపను కదుపుతూ, వొంటిమీద స్మారకం లేనట్టు ఒకటే చూపు చూస్తున్నాడు సుబ్బరామయ్య ఆ కుర్రాణ్ణి – "ఇంత వెధవ లేడు. ఎంత 'నిభా'వో"నని.

అటుపడి ఇటుపడి నాలుగు సిరామరకల కాగితాలు–పిన్ను గుచ్చినవి – పైకి లాగాడు వాడు. దుమ్ము పేరుకు పోయిఉన్న వాటిని నోటినిండా గాలి పూరించి ఊది – బల్ల మీద పడేశాడు గునుస్తూ కుర్చీమీద కూర్చొని.

తీరాచూస్తే పెన్సిలుతో గీసి పంపించిన ఎక్సర్సయిజు కాగితం ముక్కలవి.

కథపేరు – 'నీ కథేమిటి?'

"ఇదా నువ్వు రాసిన కథ!"

"మరేవిటి? – చూస్తే ఎంతో పెద్దదీ కాదు, ఇన్నాళ్ళూ ఆపేశారుకాని"

మొదట్నుంచి చివరిదాకా చదివాడు సుబ్బరామయ్య. వచ్చీరాని గొఫ్ఫీలన్నీ ఏరి

ఓ కాలిక్కి తెచ్చి బరికేసేడు గుంటవెధవ. బావులేదంటే వదల్డు వాడు. బావుందన్నా బాధే వీడితో - వేస్తావా లేదా అని వేపుకు తినేస్తాడు. అంచేత అటూఇటూ కాని ఓ మధ్యరకం ఫక్కీ ఆలోచించాడు ముసలాడు. ఆలోచించి – కాగితాలు బల్లమీదికి దింపి కామ్మణ్ని పిలిచి కాఫీకి ఆర్డరిచ్చాడు.

"ఏం చదువుతున్నావు నువ్వు?"

"ఫోర్తుఫారం. ముక్కునత్తుని తాకట్టుపెట్టి చదువు చెప్పిస్తానంది అమ్మమ్మ. తాతే వద్దన్నాడు."

"అమ్మా నాన్నాను?"

"ఎప్పుడూ లేరు నాకు – అదే కథలో రాసీసేను"

"కాఫీ తాగు ముందు"

"నా కథ పత్రికలో ఎప్పుడు వేస్తారో చెప్పండి చాలు"

"చేప్పేస్తే?"

"రేపు మరోటి తెచ్చిస్తాను. ఇంకా నాలుగయిదు రాయాలి"

దిక్కుతోచలేదు సుబ్బరామయ్యకి. వాణ్ని జబ్బ తట్టి పంపిస్తే పిసరంత యిల్లంతా చేస్తాడు. కాదన్నా చేటే! – అంచేత కాగితం తిరగేసి కళ్ళజోడు నుదుటికీ ముక్కు చివరికీ మధ్య గారడీ కొయ్యలా నిలబెట్టి కిందనుంచి నల్లగుడ్డు కనపడేలా ఎత్తి చూస్తూ ఆగి ఆగి మాటలు జారుస్తూ చెప్పాడు సుబ్బరామయ్య.

"చూడు కిష్టుడూ! కథ రాయడమంటే అలాంటి ఇలాంటి పని కాదు. బుర్రగింగుర్లెత్తిపోయి, దారీ తెన్నూ తోచక, రాత్రిళ్ళూ పగళ్లూ తల పగలకొట్టుకుంటున్న మహామహావాళ్ళే కథల్ని రాయలేక కలలు కంటున్నారు. కానైతే నువ్వు రాయలేవనీ కాదు, రాసింది బావులేదనీ కాదు. మొదటిసారి ఇలాగే రాయాలి. ఇంతా, ఇంతా గోరుముద్దలు పెట్టికదా అమ్మ కడుపు నింపుతుంది? – అంచేత రాసీ రాసీ కిందమీదా పడాలి. అప్పుడే ఓ రాస్తాకు వస్తాం మనం."

"నా కథ ఏమిటంటారు మీరు?"

"నీ కథకేం? – బంగారంలా ఉంది. చూడు – ఈ పుస్తకాల్లో పెద్దవాళ్లు ఎలాంటివి రాశారో?" – అంటూ నాలుగయిదు పాతపుస్తకాల్ని తీసి అక్కడా అక్కడా చదివి విన్పించాడు. వాడి 'నీ కథేమిటి?'లో రెండు మూడు తప్పులు చూపించాడు. హంసపాదులు పెట్టి తిప్పి రాసి, ఇలా రాయాలని ఒరవడి పెట్టాడు. కుర్రాడు అక్కడక్కడ కసుబుసుమన్నా సర్దేస్తూ చివరంటా బోధపర్చాడు సుబ్బరామయ్య. ముసలాడికంత ఓపిక ఆనాడు ఎలా వచ్చిందో దేవుడి కెరుక.

జబ్బ సత్తా చూపెట్టడానికి లాగ వచ్చిన కుర్రాడు ముప్పై నిమిషాలు తిరిగే సరికి వెన్నపూసలా అయిపోయి తన రాతలో తప్పుల్నీ, మిగతా వాళ్ళల్లో ఒప్పుల్నీ ఆకళింపు

తెచ్చుకుని కాస్సేపు కళ్ళు తేలేసి పెదవులాడించాడు.

"ఇప్పుడు నన్నేం చేయమంటారు?"

"పెద్దవాళ్ల రాతలు నాలుగు చదువు. వచ్చినట్టల్లారాయి. రాసిందల్లా మాకు పంపెయ్యకు. తిప్పి, తిప్పి చూసుకో. చూసిందే మళ్ళీ రాయి. ఇలా రాసీ కొట్టీ చేస్తే కుదుట పడతావు. రాసిందల్లా రత్నమై పోతుంది."

పనిలో బరువున్నా మాటలో ప్రోత్సాహం కన్పించే సరికి అంతయి పోయాడు ఇంతవాడూను.

"సరే అయితే నా కథ నాకిచ్చీయండి" అన్నాడు.

పెన్సిలు గీతలు బరికి కాగితాలని మూడు మడతలు పెట్టి ముందు పడేసాడు సుబ్బరామయ్య.

మూతి ముడుచుకుని వాటిని లాగూ జేబీలో తోసుకుని - నుదుటి మీదికి జారిన జుత్తుపాయ గభిక్కున మీదికి ఎగదోసి తలుపు రెక్క కరకరలాడించి కదిలిపోయాడు కిష్టయ్య.

ఉస్సురని బెత్తు కుర్చీలో వెనక్కి వంగి ముక్కుపుటాల నిండా పొడుందట్టించి గదినిండా పె....ద్ద తుమ్ము తుమ్మి కాగితం, గట్రా ముందుకి లాక్కున్నాడు సుబ్బరామయ్య.

* * * * *

కారు టైరు స్లిప్పర్లు టపటలాడిస్తుండగా, కారాకిళ్ళీ బుగ్గనిండా పెట్టుకుని, ఉండుండి తేనుపులు తేనుస్తూ, పంచెమీంచి జారిపోయే బెల్టుని మీదికి లాగుతూ, ముందుహాలు దాటి, మొదటి పావంచాగడిచి - ఆఫీసులోకి వస్తున్న సుబ్బరామయ్యకి - ఆరువారాల తర్వాత - తల వాచుకుని తమని కాదన్నట్టు పని చేసుకుపోతున్న గుమాస్తాల మధ్య ఓ నలుసు కన్పించేసరికి - ఏక్సిడెంటు చూసిన పోలీసువాడు ఏ ప్రకారంగా అయితే ఆగిపోతాడో, ఆ ప్రకారంగా ఆగిపోయిన వాడయి - అటువేపు సరాసరి నడిచిపోయేడు. ఆశ్చర్యం, అసంకల్పిత దృశ్యం అతని గుండెను ఒక్కలాగ కాల్చేస్తున్నాయి.

బల్లమీద కాగితం బొత్తిని ఉంచుకుని కిష్టయ్య గుమాస్తాల మధ్య తనూ ఒకడయిపోయి, తదేకంగా ఏదో చదివేస్తున్నాడు పెన్సిలు నుదుటిమీద ఆనించి.

ఎప్పుడూ వంచి నడిచే నడుముని నిటారుగా నిలబెట్టి నిశ్చేష్టుడై నిలబడిపోయేడు సుబ్బరామయ్య - ఈ కుర్రవెధవని చూసి.

"ఏమిరా?" అన్నాడు వాడి భుజం మీద చెయ్యేసి.

ఓ అంతక్కాని తలెత్తలేదు వాడు. తర్వాత ఎత్తి సుబ్బరామయ్యని చూసి బెత్తు కుర్చీలోంచి గభీమని దిగిపోయి - మామూలుగా లాగూ మీదికి లాక్కొని దండం పెట్టేడు- తెల్లటి పళ్ళని బయటపెట్టూ.

ఇదివరకు వాడిలో ఉన్న గర్వం, ధీమా ఇప్పుడు లేకపోవడం చూసి ఇదయిపోవడమేకాకుండా, వాడిక్కడికి ఎలా వచ్చాడు. ఎన్నాళ్ళ బట్టి వస్తున్నాడు, ఏమిటి కథా. కథామీషూ – అన్నీ ఇలాంటి సమస్యలు తనని బాధిస్తూండగా వాడిని భుజం పట్టుకుని తన గదిలోకి నడిపించుకు పోయాడు సుబ్బరామయ్య.

"ఎప్పుడొచ్చా?" వన్నాడు.

"పొద్దుటే, అందరితోపాటూ."

"ఇవాళేనా? రోజూనా?"

"రోజూను. ఎలా రాయడమో నేర్చుకుంటున్నాను."

"స్కూలో?"

"మానేసేను – అప్పుడే."

"వాళ్ళు రానిచ్చేరా?"

"వాళ్ళు రానిచ్చేదేమిటి? నేనే వచ్చేసేను. మొదట్లో కాదంటే మాత్రం? – ఇప్పుడు కథలు నేను చదవందీ ప్రింటుకావు."

వాడి ఉత్సాహం, పట్టుదల చూసి అబ్బురపడిపోయాడు సుబ్బరామయ్య.

"సరే, పో" అన్నాడు.

తుర్రుమని పారిపోయాడు కుర్రాడు.

గుమాస్తా అంటే చేసుకున్న పాపమనుకుని పనంతా చేసుకుపోతున్నారేకాని కిష్టయ్య అలాక్కాదు. కావాలని వాడి దగ్గరికీ, వీడి దగ్గరికీ పోయి వాళ్ళపని తనది చేసుకుని సాయంకాల మయ్యేసరికి చక్కబెట్టేసేవాడు. జరిగిపోవడమే కావాలి గుమాస్తాలకు. వాడి సరదా చూసి వాళ్ళకి ఆశ్చర్యం వేసినా అవసరార్థం అక్కరకు వస్తున్నాడు కదా అని అడ్డు చెప్పలేదు వాళ్ళు. అన్నీ వీడి చేతిమీదే జరిపోతున్నాయి అలా. కథలూ, వ్యాసాలూ, పద్యాలూ, చరిత్రలూ – పత్రికలో ఏది పడినా వాడికి తెలియాలి, అన్నీ తెల్సుకున్నాడు వాడు. చేతికందిన ప్రతీ కాగితం చదివేసేడు. ఆకళింపుకు తెచ్చుకొని జీర్ణం చేసుకున్నాడు. ఆరు నెలల క్రిందటి పత్రికలో ఆరోపేజీ విషయం అంటే – విపులంగా – అరటిపండు ఒలిచినట్టు అంటారే, అదిగో అలాగ చెప్పేస్తాడు. అదీ వీడిలో సామర్థ్యం, జ్ఞాపకశక్తీను.

వాడి సత్తా సుబ్బరామయ్యకూడా కనిపెట్టాడు. వాడు లేకపోతే గుమాస్తాలకి చెయ్యి విరుచుకున్నట్టుండడం కనిపెట్టేడు. ఆయనకు కుడి భుజం అయిపోయాడు పద్నాలుగేళ్ళవాడు.

"పది పేజీల వ్యాసానికి వచ్చేనెల పత్రికలో చోటుంటుందా గంగాధరంగారూ!" అని గదిలోంచి సుబ్బరామయ్య ప్రశ్నిస్తే –

గంగాధరంగారు మెల్లిగా "ఏయ్ కిష్టయ్య! వచ్చేనెల పత్రికలోకిటయ్యా – పది పేజీల వ్యాసం – ఏం?"

పై కప్పుకేసి చూసి – కనురెప్పలు ఓసారి రెపరెపలాడించి – పెద్ద ఆరిందాలాగ మూతి మొదలాడించి –

"అబ్బే! ఉండదదండీ!" అన్నాడో – అంతే! – ఇహ మరి చచ్చినా వచ్చేనెల పత్రికలో చోటు దొరకదన్నమాటే – అంత ఖరాఖండీగా విషయాలన్నీ ఔపోశనం పట్టేశాడు పిడుగు.

రోజుకాదు – రెండు కాదు – వారాలు, నెలలు, ఆఖరికి సంవత్సరాలు – రెండు– గడిపేశాడు కిష్టయ్య అదే పత్రికా కార్యాలయంలో. డబ్బూ, దస్కానికి కుదిరిన నౌఖరీకాదు. ఉద్యోగం సద్యోగం కాదు. ఊరికినే పదిపేజీల కథ రాయాలనే ఉబలాటంతో రెండేళ్ళు రాత్రీ పగలూ ఆ ఆఫీసులో గడిపాడు. కార్యాలయమంతా అతనికి ఎంతగానో అలవాటు పడిపోయింది. అతనికి కుర్చీ, బెంచీ, టేబిలూ వెలిసింది. జీతం అతను అడగనూ లేదు. వాళ్ళు కదపనూ లేదు. సుబ్బరామయ్య ఒకటి రెండుసార్లు – ఇది మనసులో అనుకున్నా బయటికి అనలేదు.

"కష్టపడనీ, ఫలితం ఎక్కడికి పోతుందీ – ఎప్పుడో అందరికళ్ళూ మిరుమిట్లు గొలిపేలా వాడికి వాడే లేచిపోతాడు. పునాదులు పడుతున్నాయి" అనుకునేవాడు.

ఎప్పుడన్నా ఎడతెగని పనిచేస్తూ కథలు చదువుతూ, ప్రూఫులు దిద్దుతూ లాగూమీదికి లాక్కుంటున్న కిష్టయ్య కంటబడితే కాఫీకి పిల్చుకుపోయి – ఏవేవో చెప్పి, భుజం తట్టి పంపేసేవాడు.

ఓ తరహా వాత్సల్యం ముసలాడికి వాడి మీద.

ఓ తరహా భక్తి కుర్రాడికి ఆయన మీద.

* * * * *

మూడేళ్ళ తర్వాత – కరకరలాడిస్తూ గాడ్పుకొట్టూన్న ఎండ సమయంలో ఇదివరకులా కాకుండా మెల్లిగా రెక్క తలుపు తోసుకు లోపలికి వచ్చేడు కిష్టయ్య.

కాగితాల మడత వాడిచేతిలో ఉంది.

నెరిసిన తలని ఓసారి రాసుకుని కళ్ళజోడు మీంచి చూశాడు సుబ్బరామయ్య.

"కథ తెచ్చేను – మళ్ళీ ఇన్నాళ్ళకి"

"తెస్తావని తెలుసు – ఎప్పుడో ఒకప్పుడు – ఇప్పుడిక నీది చదవకుండానే పత్రికలో వేసుకుంటాను"

పొంగిపోయేడు కిష్టయ్య.

వాడు తెచ్చిన కథని అలాగే పట్టుకుని అన్నాడు సుబ్బరామయ్య. "ఈ కాగితాల్లోని విజ్ఞానం నువ్వెన్నాళ్ళు కష్టపడి సంపాయించావో నాకు తెలుసు"

"దారి చూపించారు"

"బాగుపడేవారికి అన్నీ దారులే – విలువ చూసి ప్రచురిద్దాం" అన్నాడు.

లేచి వచ్చేసేడు కిష్టయ్య.

మరి పదిరోజులకి కాబోలు – ఓనాడు ఆఫీసు గదిలోంచి వస్తూంటే కిష్టయ్య బెత్తు కుర్చీలో కన్పింకపోయేసరికి పక్క గుమాస్తాని మాటమాత్రంగా కదిపేడు సుబ్బరామయ్య.

"కుర్రాడేడీ?"

"వారం రోజుల్నుంచీ టైఫాయిడుటండీ"

ఆ తర్వాత రెండు మూడుసార్లు కుర్రాడి యింటికెళ్ళి చూసి వచ్చేడు. అసలే అర్భకుడేమో, మంచానికంటుకుపోయి ఇంతయిపోయున్నాడు కిష్టయ్య.

ఏవో రెండు పళ్ళిచ్చి, అవీ, ఇవీ రెండు మాటల్చెప్పి వచ్చేసేవాడు సుబ్బరామయ్య.

ఓనాడు 'సాహితి' సంచిక పట్టుకుని కిష్టయ్య కథ ప్రచురితమయిందని చెప్పడానికి వాడింటికి బయల్దేరాడు సుబ్బరామయ్య మునిమాపు వేళకి –

గుమ్మంలో అడుగుపెట్టగానే విన్పించిన రోదనతో స్తబ్ధుగా నిలబడి పోయేడు ముసలాడు.

గబగబా అతని కళ్ళవెంట నాలుగు కన్నీటి చుక్కలు రాలేయి.

అంతకు ముందెప్పుడూ కన్నీరు కార్చలేదు సుబ్బరామయ్య.

– – –